క్లుప్తంగా

పురపాలక కార్యాలయానికి విద్యుత్ కాంతులు



పెడన మున్సిపల్ కార్యాలయం

పెడన: నూతన సంవత్సరం, సంక్రాంతి పర్వదినాలు పురస్కరించుకుని పెడన పురపాలక సంఘ కార్యాలయానికి విద్యుత్ కాంతులీనుతున్నాయి. పురపాలక సంఘం భవన సముదాయం ఏర్పడి సుమారు 20 ఏళ్లు దాటింది. నాటి నుంచి ఎటువంటి రంగులకు నోచుకోలేదు. దీంతో ప్రస్తుత మున్సిపల్ చైర్‌పర్సన్ భళ్ల జోత్స్నరాణి రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ ఆదేశాలతో మున్సిపల్ కార్యాలయానికి రంగులు వేయించడంతో పాటు విద్యుత్ దీపాలతో అలంకరించారు.

విద్యార్థులకు మాస్కులు, కిట్ల పంపిణీ



మెరకనపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మాస్కులు అందిస్తున్న రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధులు

మెరకనపల్లి(మోపిదేవి): మెరకనపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మాస్కులు, హైజనిక్ కిట్లను ఇండియన్ రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో అందజేశారు. శనివారం మండల శాఖ చైర్మన్ యర్రంశెట్టి సుబ్బారావు, వైస్ చైర్మన్ రిమ్మనపూడి సుబ్రహ్మణ్యం ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. తూర్పు ఎస్సీ కాలనీలో కర్రా లక్ష్మణరావుకు టార్పాలిన్, హైజనిక్ కిట్ అందజేశారు.

కొత్తగా 310 పెన్షన్లు మంజూరు

కోడూరు: మండలంలోని 13 పంచాయతీల్లో కొత్తగా 310 పెన్షన్లు మంజూరైనట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగదేవతి శనివారం విలేకరులకు తెలిపారు. జనవరి నుంచి మంజూరైన పెన్షన్లను అందించనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు మండలంలో 7,074 పెన్షన్లు ఉన్నాయని, ఇక నుంచి 7,384 మందికి పింఛన్లు అందించనున్నట్లు తెలిపారు. సచివాలయ కన్వీనర్లను కలుపుకొని వలంటీర్లు పెన్షన్లను పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

గంజాయి విక్రేత అరెస్టు

చిలకలపూడి(మచిలీపట్నం): ఎస్పీ జాషువాకు వచ్చిన సమాచారం మేరకు ఇనుగుదురుపేట పోలీసులు శనివారం గంజాయి విక్రయదారులను అరెస్టు చేశారు. సీఐ ఉమామహేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం స్టేషన్ పరిధిలోని ఉల్లింగిపాలెంలో బలగం నాగరాజు, బలగం శివ, బలగం రామలక్ష్మి, బలగం నందిని నివాసంలో 6.150 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వీరిని అరెస్టు చేసి కోర్టుకు తరలించగా 15 రోజులు రిమాండ్ విధించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్వో మోహనరావుకు తీవ్రగాయాలు

కొక్కిలిగడ్డ(మోపిదేవి): కొక్కిలిగడ్డ గ్రామంలో కె. కొత్తపాలెం వీఆర్వో మేరుగు మోహనరావు ద్విచక్రవాహనం వెళ్తున్నారు. ఎదురుగా వస్తున్న కారు ఆయన వాహనాన్ని ఢీ కొనడంతో వీఆర్వో కాలు విరిగింది. సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని 108లో మచిలీపట్నం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

'గూడూరు' సర్పంచుల సంఘ అధ్యక్షుడిగా జయవర్ధన్



గూడూరు: మండల సర్పంచుల సంఘ అధ్యక్షుడిగా సమ్మెట జయవర్ధన్ ఎన్నికయ్యారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సర్పంచుల సంఘ అధ్యక్ష ఎన్నికల్లో జయవర్ధన్‌కు మండలంలోని సర్పంచులు ఏకగ్రీవంగా మద్దతిచ్చారు. జయవర్ధన్‌ను ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, ఏపీ ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ గొరిపర్తి వరలక్ష్మి, వైస్ ఎంపీపీ నేతల కుటుంబరావు, ఆర్బీకే చైర్మన్ పర్ణం పెదబాబు, వైసీపీ నాయకులు గొరిపర్తి రవికుమార్, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పీఏసీఎస్ చైర్మన్లు అభినందించారు. గతంలో కోకనారాయణపాలెం సర్పంచ్ బండి రమేష్ సర్పంచుల సంఘ అధ్యక్షుడిగా వ్యవహరిస్తూ మరణించడంతో ఎన్నికలు నిర్వహించారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

పామర్రు: మద్యం సేవించి వాహనాలను నడిపే వారిపై చర్యలు తీసుకుంటామని పామర్రు ఎస్‌ఐ అవినాష్ హెచ్చరించారు. స్థానిక మానవతా సేవాసంస్థ సర్వసభ్య సమావేశంలో ఎస్‌ఐ శనివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ రహదారులపై స్థానిక రోడ్లపై నూతన సంవత్సర వేడుకలు నిషేధమన్నారు. ప్రమాదాలు జరిగే ప్రదేశాల వద్ద తగిన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు.

కార్యకర్తలకు అండగా వైఎస్సార్ సీపీ



కోడూరు సమావేశంలో సూచనలిస్తున్న అవనిగడ్డ పరిశీలకులు శ్రీలత, పక్కన ఎమ్మెల్యే సింహాద్రి

కోడూరు: పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు వైఎస్సార్ సీపీ అండగా నిలిచి సముచిత స్థానం కల్పించడానికి చర్యలు తీసుకుంటుందని అవనిగడ్డ నియోజకవర్గ పరిశీలకులు, సాహితీ అకాడమీ చైర్మన్ పిల్లంకొండ శ్రీలత అన్నారు. శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద కొత్తగా నియమితులైన సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, విజయవాడ సెంట్రల్ పరిశీలకులు కడవకొల్లు నరసింహారావుతో కలిసి శ్రీలత పాల్గొని మాట్లాడారు. ప్రతి సచివాలయ పరిధిలో ముగ్గురు కన్వీనర్లను నియమించాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించారని, వీరంతా వలంటీర్లను సమన్వయపరుస్తూ ప్రజాసంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని శ్రీలత సూచించారు. జనవరి 10లోపు ప్రతి వలంటీరు పరిధిలో ఇద్దరు గృహసారథుల నియామకాలు చేపట్టాలని, వీటిపై గ్రామస్థాయిలో నేతలు కసరత్తు చేయాలని శ్రీలత ఆదేశించారు.

రెండు రోజుల్లో వలంటీర్లతో సమావేశం

సమావేశానికి హాజరుకాని వలంటీర్ల తీరుపై ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అసహనం వ్యక్తం చేశారు. మండల స్థాయిలో జరిగే సమావేశానికి కూడా వలంటీర్లు రాకపోతే ప్రజలకు ఎలా సేవలందిస్తారని మండిపడ్డారు. రెండు రోజుల్లో మళ్లీ వలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేస్తానని రమేష్‌బాబు తెలిపారు. మండలంలోని 11 సచివాలయాల పరిధిలో 39మంది సచివాలయ కన్వీనర్లను నియమించామని, వీరందరూ గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని రమేష్‌బాబు కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, సర్పంచి వెన్నా షైనీ, పార్టీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణరావు, ఎంపీటీసీలు బడే గంగాధర్, సనకా శైలజ, మీసాల రాణినాంచారమ్మ, పీఏసీఎస్ చైర్‌పర్సన్లు కోసూరు రమేష్, కటకం కుటుంబరావు, వైస్ ఎంపీపీ ముక్కు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింహాద్రి

కాపుల మధ్య విద్వేషాలు రెచ్చకొడితే సహించం

ఓటు రాజకీయాల కోసం కాపుల మధ్య విద్వేషాలు రెచ్చకొట్టాలని చూస్తే సహించబోమని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు హెచ్చరించారు. లోకేష్ పాదయాత్ర, పవన్‌కల్యాణ్ బస్సు యాత్రలతో ప్రజలకు ఒరిగేదేమి లేదని, వీరి యాత్రల కారణంగా రాజకీయాలు మారే పరిస్థితులు ఏమి లేవన్నారు. సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఎప్పుడూ ఆదరిస్తారని రమేష్‌బాబు ధీమా వ్యక్తం చేశారు. పవన్ కల్యాణ్ పోటీ చేయలేక చంద్రబాబుకు మద్దతు తెలపడం సరికాదని హితవు పలికారు. కాపు నేత ముద్రగడను చంద్రబాబు, టీడీపీ నేతలు ఇబ్బంది పెడితే పట్టించుకోని పవన్‌కల్యాణ్ ఇప్పుడు కాపులపై ప్రేమ కురిపించడం హాస్యాస్పదంగా ఉందని చెప్పారు. కాపునేత రంగాను దారుణంగా హత్య చేసిన టీడీపీని పవన్‌కల్యాణ్ సమర్థించడం రాజకీయ కుట్రలో భాగమేనన్నారు. రాష్ట్రంలో రోడ్లు అధ్వానంగా ఉండటానికి కారణం టీడీపీ ప్రభుత్వమేనని రమేష్‌బాబు అన్నారు. రోడ్లు అధ్వానంగా ఉండటానికి చంద్రబాబే కారణమని తెలిపారు.

విద్యార్థులు ప్రతిభావంతులు కావాలి



ట్యాబులు, స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ కల్యాణి



విద్యార్థులకు ట్యాబ్‌లు అందిస్తున్న సర్పంచ్ రాంబాబు



ట్యాబ్‌లు అందచేస్తున్న ప్రజాప్రతినిధులు

చల్లపల్లి: రాష్ట్ర ప్రభుత్వ ప్రోత్సాహాన్ని వినియోగించుకుని విద్యార్థులు ప్రతిభావంతులు కావాలని జెడ్పీటీసీ రాజులపాటి కల్యాణి అన్నారు. శనివారం మండల పరిధిలోని పురిటిగడ్డ, వక్కలగడ్డ జెడ్పీ హైస్కూళ్లలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన ట్యాబులు, పదో తరగతి విద్యార్థులకు జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక సమకూర్చిన స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రాష్ట్ర చైర్మన్ రాజులపాటి శివప్రసాద్, వక్కలగడ్డ పీఏసీఎస్ చైర్మన్ హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ పాల్గొన్నారు.

కొక్కిలిగడ్డ(మోపిదేవి): మండల పరిధిలోని కొక్కిలిగడ్డ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లను సర్పంచ్ దిడ్ల జానకీ రాంబాబు శనివారం అందించారు. బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను 8వ తరగతి విద్యార్థులు 28 మందికి ఉచితంగా అందచేసినట్లు పాఠశాల హెచ్‌ఎం బచ్చు సీతారామాంజనేయులు తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బంటుమిల్లి: మల్లపరాజుగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం పలువురు ప్రజాప్రతినిధులు ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబ్‌లు అందచేశారు. ఎంపీపీ వి. చినబాబు మాట్లాడుతూ విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలో సాంకేతికత ద్వారా ఉన్నత విద్యను అందజేయడానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయం విప్లవాత్మకమైనదన్నారు. ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకుని పోటీ పరీక్షలకు సిద్ధపడాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.వెంకటరమణ, ఏఎంసీ వైస్ చైర్మన్ బాబూరావు, సర్పంచ్ అవతారం, పీఎంసీ చైర్మన్ పి.సావిత్రి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు ఎం. రాజబాబు, నాయకులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెడ్ రైస్.. వెరీ నైస్!

బాపట్ల వ్యవసాయ కళాశాల అన్నదాతకు అండగా నిలుస్తోంది. ఇప్పటికే బీపీటీ వంటి మేలు రకం వరి వంగడాలు తయారు చేసిన కళాశాల, తాజాగా రెడ్ రైస్ వంగడాన్ని సృష్టించి రైతుకు తోడ్పాటు అందించడంలో మరో అడుగు ముందుకేసింది. గతంలో రూపొందించిన బ్లాక్ రైస్ విజయవంతమవడంతో అదే స్ఫూర్తితో మరింత మెరుగైన రెడ్ రైస్ వంగడాన్ని రూపొందించి రైతులకు కానుకగా అందిస్తోంది. పూర్తి ఆరోగ్యకరమైన ఈ వంగడం అధిక దిగుబడితో పాటు ప్రజల ఆరోగ్యానికి రక్షగా నిలుస్తుంది. బ్లాక్ రైస్ (బీపీటీ–2841) సత్ఫలితాలను ఇస్తుండగా రెడ్ రైస్– 2858 రకాన్ని తొలిసారిగా పొలంబడి సాగుకు సిద్ధం చేసినట్లు బాపట్ల వరి పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ కృష్ణవేణి తెలిపారు.



రెడ్ రైస్ సాగు క్షేత్రాన్ని పరిశీలిస్తున్న బాపట్ల వరిపరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టరు కృష్ణవేణి



బాపట్ల: బాపట్ల వరి పరిశోధన సంస్థ రెడ్ రైస్‌ను బీపీటీ 2858తో ముందుకు తీసుకువచ్చింది. బాపట్లలోని గులాం హుస్సేన్ తోట పరిధిలోని లేళ్ల వెంకటప్పయ్య భూమిలో మినీకిట్ల ద్వారా అర ఎకరంలో బీపీటీ 2858 రకం సాగు చేయగా పంట ఆశాజనకంగా ఉంది. ఆశించిన స్థాయిలో దిగుబడి వస్తుందని అంచనా వేశారు. కాండం గట్టిదనంతో పాటు కంకి కూడా బాగా ఉండటంతో దిగుబడి బాగుంటుందని భావిస్తున్నారు.

ధాన్యం సన్నగా ఉండి, 1000 గింజల బరువు సుమారు 14 నుంచి 14.5 గ్రాములు ఉంటుంది. రబీ, ఖరీఫ్ రెండు సీజన్లలో అన్ని రకాల భూముల్లో సాగు చేసుకోవచ్చు. ఎకరాకు 30 నుంచి 35 బస్తాల దిగుబడులు వస్తాయి. ఆర్గానిక్ సాగు కింద పండించుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. ధాన్యాన్ని 2 శాతం పాలిష్ చేసుకుంటే సాధారణ బియ్యం ఉడికించినంత సమయంలో అన్నం సిద్ధమవుతుంది. సాగులో ఆశించిన ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నారు. దేశవాళీ నల్ల వంగడాలతో పోలిస్తే అధిక దిగుబడులు వస్తున్నాయి.

బీపీటీ 2841 వంగడానికి సిఫార్సు

బాపట్లలోని వ్యవసాయ వరి పరిశోధన స్థానం రైతులకు అద్భుతమైన వంగడాలను సిఫార్సు చేస్తోంది. దశాబ్దాల తరబడి ఈ కేంద్రం అందిస్తున్న వంగడాలు సత్ఫలితాలు సాధిస్తున్నాయి. ఇప్పటివరకు పది రకాల వంగడాలను భారతదేశానికి ఈ పరిశోధన కేంద్రం పరిచయం చేసింది. రైతులకు తాజాగా నల్లబియ్యం రకాన్ని సిఫార్సు చేసింది. బీపీటీ 2841 పేరుతో బ్లాక్ రైస్ వంగడాన్ని విడుదల చేసింది. బ్లాక్ రైస్‌లో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. అత్యధిక పోషకాలు అందించడమే కాకుండా, షుగర్ వ్యాధిగ్రస్తులకు ఈ రకం బియ్యం మంచి ఆరోగ్యాన్ని అందిస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్లో కిలో 290 నుంచి 330 రూపాయల వరకు నల్ల బియ్యాన్ని విక్రయిస్తున్నారు. అద్భుతమైన, ఆరోగ్యవంతమైన, చీడపీడలను తట్టుకునే సామర్థ్యం కలిగిన ఈ నల్లబియ్యం రకం పంట కాలం 130 రోజులు ఉంటుంది. ప్రస్తుతం ఈ బ్లాక్ రైస్ వంగడాన్ని మినీకిట్ల ద్వారా రైతులకు అందజేస్తున్నారు. రాష్ట్రంలోని అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాలు మినహాయించి మిగిలిన పది జిల్లాల్లో ఈ బ్లాక్ రైస్ పండించడానికి అనువుగా ఉంటుంది. నల్ల బియ్యంలో ఉన్న యాంటీఆక్సిడెంట్లు ఆరోగ్యానికి మేలు చేస్తాయన్న ఉద్దేశంతో వాటికి ఆదరణ పెరుగుతోంది. తెలుగు రాష్ట్రాల్లో నల్లధాన్యం సాగు క్రమంగా విస్తరిస్తోంది. రాష్ట్రంలోని పది జిల్లాలతో పాటు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో సాగు చేశారు. ఇందులో ఆశించిన ఫలితాలు రావడంతో రైతుల నుంచి విత్తనాలకు డిమాండ్ పెరిగింది. ఈ ఏడాది మరికొంత మందికి చిరుసంచుల్లో విత్తనాలు సరఫరా చేయడానికి పరిశోధన స్థానం ప్రణాళిక సిద్ధం చేసింది. దిగుబడులు ఆశాజనకంగా ఉండటం, తుఫాన్లను తట్టుకుని నిలబడటం, నల్ల ధాన్యంలో పోషక విలువలు ఉండటంతో సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

పైరు స్వభావం ఇలా..

బీపీటీ 2858 రకం వరి ధాన్యం నుంచి తీసే బియ్యం పైపొర ఎరుపు రంగులో ఉంటుంది. బియ్యానికి పైపొరలోని ఎరుపు రంగు ఆంథోసైనిన్ అనే పదార్థం వల్ల ఏర్పడుతుంది. సాధారణంగా మనం రోజూ ఆహారంగా తీసుకునే వరి రకాల పైపొరలో పాలీఫినాల్స్, యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువ పరిమాణంలో ఉంటాయి. ఎరుపు బియ్యం పైపొరలో ఉండే ఆంథోసైనిన్‌లో ఉండే యాంటీఆక్సిడెంట్లు సూపర్‌ఫుడ్ యాంటీఆక్సిడెంట్లతో సమానమైన పోషక విలువలను కలిగిఉన్నట్లు పరిశోధనల్లో తేలింది. యాంటీ ఆక్సిడెంట్ యాక్టివిటీ ఎక్కువగా ఉన్న ఆహార పదార్థాలను ఆహారంగా తీసుకున్నప్పుడు అవి శరీరంలో ఉత్పత్తి అయిన ఫ్రీరాడికల్స్‌ను సమతుల్యం చేయడం వల్ల పలు రకాల క్యాన్సర్లు, గుండె సంబంధిత సమస్యలు, మధుమేహం వంటి దీర్ఘకాలిక రుగ్మతలను ఎదుర్కొనే శక్తి పెరుగుతుంది. 130 నుంచి 140 రోజులు దీని పంటకాలం. హెక్టారుకు 6 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. పైరు సుమారు 110 సెంటీమీటర్ల ఎత్తు పెరుగుతుంది. దోమ, అగ్గితెగులును తట్టుకుంటుంది.

బందరు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

పేర్ని కిట్టు



సబ్‌స్టేషన్ ప్రారంభ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన పేర్ని కిట్టు, మేయర్ వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నంటౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బందరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించారని వైఎస్సార్ సీపీ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. స్థానిక 34వ డివిజన్ దేశాయిపేటలో రూ. 1.50 కోట్ల వ్యయ అంచనాతో నిర్మించిన ఇనుగుదురుపేట 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మేయర్ మోకా వెంకటేశ్వరమ్మతో కలిసి ఆయన ప్రారంభించారు. పేర్ని కిట్టు మాట్లాడుతూ ఈ ప్రాంతవాసుల అవసరాలను ఎమ్మెల్యే పేర్ని నాని.. సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లిన వెంటనే ఆయా పనులకు సీఎం జగన్ నిధులు మంజూరు చేస్తూ అభివృద్ధికి తోడ్పాటును అందిస్తున్నారన్నారు. దేశాయిపేట ప్రాంతంలో 2013 నుంచి లో ఓల్టేజీ సమస్యతో విద్యుత్ వినియోగదారులు నానా ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. కార్పొరేటర్ మీర్ అస్గర్‌అలీ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో లోఓల్టేజీ సమస్య పరిష్కరించాలని గత టీడీపీ పాలకులకు పలుమార్లు విజ్ఞప్తి చేసినా, ఆందోళన కార్యక్రమాలు చేపట్టినా చీమైనా కుట్టినట్లు లేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే పేర్ని నానిని అస్గర్‌అలీతో పాటు 34, 35 డివిజన్ల పార్టీ ఇన్‌చార్జ్‌లు బడే భానుతేజ, షేక్ ఇక్బాల్ ఈ ప్రాంతంలో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలంటూ కోరామన్నారు. ఈ విషయాన్ని పేర్ని నాని సీఎం దృష్టికి తీసుకువెళ్లటంతో మంజూరు చేశారని శంకుస్థాపనైన ఆరు నెలల్లోనే విద్యుత్‌శాఖ అధికారులు పనులు పూర్తి చేసి ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఎలక్ట్రికల్ ఎస్‌ఈ మురళీమోహన్ మాట్లాడుతూ అవసరాలకు అనుగుణంగా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడానికి తమ సంస్థ కృషి చేస్తోందని చెప్పారు. ఏడీఈ కృష్ణారావు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ఎంయూడీఏ చైర్మన్ బొర్రా నాగదుర్గాభవాని, డిప్యూటీ మేయర్లు తంటిపూడి కవితథామస్‌నోబుల్, లంకా సూరిబాబు, మునిసిపల్ చైర్మన్ షేక్ సలార్‌దాదా, ఎలక్ట్రికల్ డీఈ ఎం భాస్కరరావు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, 34వ డివిజన్ కార్పొరేటర్ బడే రాధిక తదితరులు పాల్గొన్నారు.

చిలకలపూడి(మచిలీపట్నం): పెదకరగ్రహారం పంచాయతీ క్యాంప్‌బెల్‌పేటలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో మౌలిక వసతులను వైఎస్సార్ సీపీ యువ నాయకుడు పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) శనివారం ప్రారంభించారు. కిట్టు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల కోసం పక్కా ఇళ్ల నిర్మాణానికి శ్రీకాకరం చుట్టారన్నారు. ఇందులో భాగంగా కాలనీలో ఇంటి నిర్మాణం పూర్తి చేసిన వారికి శనివారం విద్యుత్ కనెక్షన్లు ఇచ్చి వీధి దీపాలను ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు శొంఠి ఫరీద్, పంచాయతీ కార్యదర్శి నరసింహారావు, విద్యుత్‌శాఖ అధికారులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ



సంఘ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా

చిలకలపూడి(మచిలీపట్నం): ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం టేబుల్ క్యాలెండర్‌ను కలెక్టర్ రంజిత్‌బాషా శనివారం ఆయన చాంబర్‌లో ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ఉద్యోగులు అంకితభావంతో పనిచేసి రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.రాము, తోట వరప్రసాద్, సభ్యులు ఎంవీ శ్యామ్‌నాథ్, వి. సీతారామయ్య, బాలాజీ, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారులకు తీపి కబురు

మోపిదేవి: నూతన సంవత్సరం సందర్భంగా కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు పాలక వర్గసభ్యులు పాడి రైతులకు తీపి కబురు అందించారని మండలంలోని పాల సేకరణ కేంద్రం సంఘం అధ్యక్షులు హర్షం వ్యక్తంచేశారు. మోపిదేవిలో శనివారం మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న లీటరు ధర 73ను రూ. 5లు పెంచి జనవరి ఒకటో తేదీ నుంచి లీటరు రూ. 78 చేసినట్లు తెలిపారు. సహకార వ్యవస్థలో సహకారం, సంక్షేమం రెండు కళ్లుగా భావించి రైతులకు మేలు చేయడానికి జిల్లా పాలక వర్గం నడుచుకున్న సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని సంఘం అధ్యక్షులు బొందలపాటి వెంకట వరప్రసాద్, పుప్పాల సతీష్‌బాబు, శ్రీనివాసరావు, కోనేరు వెంకటేశ్వరావు, కంఠంనేని వెంకట శేషగిరిరావు, మద్దిపట్ల సీతారామయ్య, నాదెళ్ల వెంకట భవాని శంకర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెడన: కృష్ణా మిల్క్ యూనియన్ పాల సేకరణ ధర పెంపు పట్ల పెడన మండలంలోని పలు పాల సంఘాల అధ్యక్షులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం పెడన నాలుగో వార్డులోని పాల సంఘ కేంద్రంలో పెడన, నడుపూరు, కట్లపల్లి, కూడూరు, మడక సంఘాల అధ్యక్షులు సమావేశమయ్యారు. అబ్దుల్‌ఖయ్యూం, చీర్ల కృష్ణంరాజు, ముక్కు గోవిందు, కాగిత అమలశ్రీనివాసరావు, జోగి ప్రకాశరావు తదితరులు మాట్లాడారు.

చల్లపల్లి: పాల ఉత్పత్తిదారులకు చెల్లించే పాల ధర పెంచటంపై వక్కలగడ్డ పాల ఉత్పత్తిదారుల సంఘ అధ్యక్షులు మల్లుపెద్ది నాగభూషణం (బోసు) హర్షం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక పాల శీతలీకరణ కేంద్రంలో విలేకురులతో మాట్లాడుతూ కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు తీసుకున్న నిర్ణయంతో లక్షా యాభై వేల పాడి రైతు కుటుంబాలకు మేలు కలుగుతుందన్నారు. యార్లగడ్డ, చల్లపల్లి సంఘ అధ్యక్షులు బొబ్బా వెంకటేశ్వరరావు, బెల్లంకొండ లక్ష్మి పాల్గొన్నారు.

దళిత పక్షపాతి సీఎం జగన్

మచిలీపట్నంటౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దళిత పక్షపాతి అని సోషల్ జస్టిస్ రాష్ట్ర చైర్మన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు జూపూడి ప్రభాకర్ అన్నారు. శనివారం మచిలీపట్నం విచ్చేసిన ఆయనను రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జక్కుల ఆనందబాబు, పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. జూపూడి మాట్లాడుతూ టీడీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలోని 22 లక్షల మంది ఎస్సీలకు కేవలం రూ. 150కోట్లు ఖర్చు చేశారని ప్రస్తుత మూడున్నర ఏళ్ల సీఎం జగన్ పాలనలో రూ. 1.18 కోట్ల మంది ఎస్సీలకు రూ. 7,500 కోట్లు మేర లబ్ధి చేకూర్చారన్నారు. ముందస్తుగా నూతన సంవత్సర కేక్‌ను జూపూడితో పాటు, జక్కుల ఆనందబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు బందెల థామస్‌నోబుల్, జి చంద్రబాబు, ఉచ్చుల గణేష్, నల్లబ్రోలు శామ్యూల్ తదితరులు కట్ చేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తనిఖీ



రామనపూడిలో రైతులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరమణ

పెదపారుపూడి: మండలంలోని పెదపారుపూడి, యలమర్రు ఆర్బీకేల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ వి.నాగభూషణం శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పెదపారుపూడి కొనుగోలు కేంద్రంలో మాట్లాడుతూ.. ఆర్బీకేలో తీసిన ధాన్యం తేమ శాతం ఫైనల్ అన్నారు. రైస్ మిల్లుల్లో ఎటువంటి తేడావచ్చిన రైతులకు సంబంధం ఉండదన్నారు. ధాన్యం నగదు విక్రయించిన 21 రోజుల్లో రైతుల బ్యాంక్ ఖాతా జమ చేస్తామని చెప్పారు. పెదపారుపూడిలోని రైస్ మిల్లుల్లో ఉన్న ధాన్యాన్ని తహసీల్దార్ పరిశీలించారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు మెరుగైన సేవలు అందించాలి

గుడివాడరూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రానికి వచ్చే రైతులకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీడీఓ అనగాని వెంకటరమణ పేర్కొన్నారు. మండల పరిధిలోని రామనపూడి గ్రామంలోని రైతుభరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈసందర్భంగా ధాన్యం కొనుగోలు, ఇతర సమస్యలపై సిబ్బందితో మాట్లాడారు. వ్యవసాయ సహాయకులు రైతులతో స్నేహపూర్వక వాతావరణంలో నడుచుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని రకాల సౌకర్యాలను వివరించాలన్నారు. సచివాలయ ఉద్యోగులు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

పర్నాసలో మెగా పశు వైద్యశిబిరం



పశుపోషకులకు మిక్చర్ అందజేస్తున్న ఎంపీపీ పుష్పరాణి, జెడ్పీటీసీ రామకృష్ణ

గుడివాడరూరల్: పశువుల ఆరోగ్యం పట్ల పశుపోషకులు శ్రద్ధ వహించాలని ఎంపీపీ గద్దే పుష్పరాణి పేర్కొన్నారు. మండల పరిధిలోని పర్నాస గ్రామంలో లయన్స్‌క్లబ్ గుడివాడ ప్రగతి ఆధ్వర్యంలో శనివారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు గోళ్ల రామకృష్ణతో కలిసి ప్రారంభించి పశు పోషకులకు మిక్చర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ప్రభుత్వం పశు పోషకులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. పశు వైద్య శిబిరాన్ని ఉపద్రష్ట వెంకటసత్య గాయత్రి జ్ఞాపకార్థం వారి కుమారులు నిర్వహించడం అభినందనీయమన్నారు. జెడ్పీటీసీ రామకృష్ణ మాట్లాడుతూ.. పాడి, పరిశ్రమలు అభివృద్ధి చెందితే పాడి రైతుల కుటుంబాలు సంతోషంగా ఉంటాయన్నారు. సర్పంచ్ గొర్ల రాజేష్, పశు సంవర్ధక శాఖ ఏడీ లక్ష్మీనారాయణ, పశు వైద్యులు టి.వేణు, వి.హనుమంతరావు, వీణప్రగతి, సెక్రటరీ నల్లూరి శేషగిరిరావు, లయన్స్ నాయకులు ఉపద్రష్ట రాంబాబు, రామధేని వేణుబాబు పాల్గొన్నారు. శిబిరంలో 80 పశువులకు గర్భకోశ వ్యాధులు, నట్టల నివారణ చికిత్సలు చేసి మందులు ఉచితంగా అందజేశారు.

● **యలమర్రు(పెదపారుపూడి):** రీ సర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వి.నాగభూషణం అన్నారు. మండలంలోని యలమర్రు జరుగుతున్న రీ సర్వేను ఆయన శనివారం పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. భూ సమస్యలను పరిష్కరించుకోవడానికి మంచి అవకాశం వచ్చిందన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించండి

ఎమ్మెల్యే పేర్ని నాని

మచిలీపట్నంటౌన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్న పథకాలను ఆయా లబ్ధిదారులకు అందుతున్న తీరును వైఎస్సార్ సీపీ డివిజన్ కన్వీనర్లు ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) పిలుపునిచ్చారు. నూతనంగా నియమితులైన డివిజన్ కన్వీనర్లు, కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జ్‌లు, నాయకులతో శనివారం ఆయన రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ హాలులో సమావేశమయ్యారు. పేర్ని నాని మాట్లాడుతూ ఆయా కుటుంబాలకు కన్వీనర్లు తలలో నాలుకలా ఉంటూ ప్రభుత్వ నుంచి సాయం అందేలా కృషి చేయాలన్నారు. జనవరి ఒకటో తేదీ నుంచి రూ. 250 పెంచి ఇవ్వనున్న పింఛన్లను కన్వీనర్లు వలంటీర్లతో కలిసి అందజేయాలన్నారు. పార్టీకి విధేయులుగా, నమ్మకంగా పని చేయాలని సూచించారు. ఎల్లో మీడియా ప్రభుత్వ పనితీరుపై రోజూ విమర్శలు గుప్పిస్తూ వార్తలు వండివారుస్తున్నాయని ఇవి అవాస్తవమని ప్రజలకు వివరించడానికి కన్వీనర్లు చొరవ చూపాలన్నారు. డివిజన్లలో మీకు శత్రువులుగా ఉన్నా వారికి కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందకపోతే సీఎం జగన్‌కు మీరు నమ్మక ద్రోహం చేసిన వారవుతారని పేర్ని నాని అన్నారు. కన్వీనర్లు వారి పరిధిలో పార్టీ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు షేక్ సలార్‌దాదా, మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ బూరగడ్డ రమేష్‌నాయుడు, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రావితల్, డెప్యూటీ మేయర్లు లంకా సూరిబాబు, తంటిపూడి కవిత థామస్‌నోబుల్, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పేర్ని నాని

ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలి: నాని

మచిలీపట్నంటౌన్: మాజీ మంత్రి, బందరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య (నాని) రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 నూతన సంవత్సరంలో ప్రజలు పాడి పంటలు, సుఖసంతోషాలతో,ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం ఒమిక్రాన్ బీఎఫ్ 7 నెమ్మదిగా విస్తరిస్తున్న దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

మృతుని కుటుంబానికి బీమా చెక్కు అందజేత

మచిలీపట్నంటౌన్: నాగాయలంక మండలం గుల్లలమోదకు చెందిన విశ్వనాథపల్లి నాగబాబు వ్యవసాయ పనులు చేస్తూ పాముకాటుకు గురై మృతి చెందాడు. మృతుడు నాగబాబు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఖాతాదారుడు, పర్సనల్ యాక్సిడెంట్ పాలసీదారుడు. దీంతో బ్యాంకు అధికారులు నాగబాబు భార్య వెంకటేశ్వరమ్మకు శనివారం రూ. 10 లక్షల చెక్కును స్థానిక ఆజాద్ రోడ్డులోని ఎస్‌బీఐ రీజనల్ ఆఫీస్‌లో మేనేజర్ వి.వి. ఫణిరామ్‌కుమార్ అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ నాగాయలంక బ్రాంచ్ మేనేజర్ జి.నరేంద్రబాబు, జనరల్ మేనేజర్ యు.సురేష్, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ సీతారామయ్య తదితరులు ఉన్నారు.

'ముక్కోటి'కి ఆలయాల ముస్తాబు

కోడూరు: శ్రీమహావిష్ణువు గరుడ వాహనంపై మూడు కోట్ల దేవతలతో భూలోకానికి దిగి వచ్చి భక్తులకు దర్శనమిచ్చే ముక్కోటి ఏకాదశి పర్వదినానికి వైష్ణవాలయాలను ముస్తాబు చేస్తున్నారు. అభినవ మేల్కోటగా పేరుగాంచిన ఉల్లిపాలెంలోని గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణస్వామి ఆలయంలో 2వ తేదీ సోమవారం ఉదయం 5గంటల నుంచి ఉత్తరద్వార దర్శనం ద్వారా భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు అష్టాక్షరీ పీఠాధిపతి త్రిదండి అష్టాక్షరీ సంపత్ కుమార్ రామానుజీయర్ స్వామిజీ శనివారం తెలిపారు. కోడూరులోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కూడా సోమవారం ఉదయం 4గంటల నుంచి దర్శించుకోవచ్చని ధర్మకర్త కోట పద్మావతి వరప్రసాద్ చెప్పారు.



ఉల్లిపాలెంలో గోదా, రాజ్యలక్ష్మి సమేత శ్రీమన్నారాయణుడు

● **చల్లపల్లి:** త్రోబాల్ జాతీయ స్థాయి పోటీలకు స్థానిక విజయ క్రాంతి జూనియర్ కళాశాల విద్యార్థిని సాయిదుర్గ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ దుట్టా శివరామప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 22, 23 తేదీల్లో విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిందని పేర్కొన్నారు.